క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఇది తగునా...!

బలిజిపేట: పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మహిళా ఉద్యోగి, మండల మెజిస్ట్రేట్ అయిన పార్వతీపురం తహసీల్దార్ విజయలక్ష్మిని దుర్భాషలాడడం సమంజసం కాదని దళిత బహుజన సేవా సంఘం ఉపాధ్యక్షుడు, ఉత్తరాంధ్ర ఇంచార్జ్ ఎస్.కామేశ్వరరావు ఖండించారు. మహిళా ఉద్యోగిని రాత్రి సమయంలో ఫోన్ ద్వారా దుర్భాషలాడి కించపరచడం సరికాదన్నారు. ఉద్యోగులపై వేధింపులు, దౌర్జన్యాలు, బెదిరింపులు మానుకోవాలని హితవు పలికారు.

అందరి సహకారంతో మెరుగైన సేవలందిస్తా...


ఎంపీడీవో ప్రసాద్‌ను కలిసిన అధికార సిబ్బంది

సీతానగరం: మండలంలోని పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా కృషి చేస్తానని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంఎల్ఎన్ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండలంలోని దీర్ఘకాలంగా ఏవోగాను ఇన్‌చార్జి ఎంపీడీవోగాను పని చేయడంతో అందరూ పరిచయం ఉన్నందున వారి సహకారంతో మెరుగైన సేవలందించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముందుగా ఎంపీడీవో ప్రసాద్‌కు ఇంచార్జ్ ఎంపీడీవో కె.కుమారవర్మ, ఏవో వెంకటరావు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల పరిశీలన


ఎస్సీ బాలుర వసతిగృహంలో సరుకులు పరిశీలిస్తున్న జుడీషియల్ మెజిస్ట్రేట్ సౌమ్య జోషఫిన్

పార్వతీపురం టౌన్: సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలను అడిషనల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోషఫిన్ శనివారం పరిశీలించారు. జిల్లా న్యాయ సేవా సాధికారత సంస్థ ఆదేశాల మేరకు పరిశీలించారు. పట్టణంలోని బాలికల బీసీ వసతిగృహం, ఎస్సీ వసతిగృహం, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ఎస్సీ బాలుర వసతిగృహం, బీసీ బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. నిత్యావసర సరుకులు చూశారు.

వ్యాన్ - బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలు

సీతానగరం: మండలంలోని ఎయిమ్ ఫర్ సేవా ఛాత్రాలయం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని కృష్ణారాయపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న బైక్‌ను బొబ్బిలి నుంచి సీతానగరం వైపు వస్తున్న వ్యాన్ ఛాత్రాలయం సమీపంలో ఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు కింద పడి గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. బైక్ డ్రైవ్ చేస్తున్న కాశిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు.

23న మున్సిపల్ సమావేశం

పార్వతీపురం టౌన్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 23న నిర్వహించనున్నట్టు కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నిబంధనలు పాటించాలి


ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌తో మాట్లాడుతున్న రవాణా శాఖాధికారి సత్యనారాయణ

పార్వతీపురం రూరల్: వాహన చోదకులు కచ్చితంగా నిబంధనలు పాటించి రహదారిపై రాకపోకలను సాగించాలని రవాణా శాఖ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. పార్వతీపురం శివారులో ఉన్న వైకేఎం కాలనీ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై శనివారం వాహనాలు తనిఖీ చేశారు. తనిఖీలు చేస్తున్న వాహనాల్లో ఇసుక తరలించే ట్రాక్టర్‌ను ఆపి నిబంధనలు పాటించకుండా ఇసుక రవాణా చేయడం పట్ల ఆయన అవగాహన కల్పించారు. ఇసుకను తరలించినపుడు కచ్చితంగా టార్పలిన్‌ను ఏర్పాటు చేసి వెనుక వైపు వచ్చే వాహనాలకు ఇబ్బంది లేకుండా జాగ్రత్త పడాలన్నారు. అలాగే మరి కొన్ని వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించి అపరాధ రుసుం విధించారు.


నేటి నుంచి శ్యామలాంబ అమ్మవారి పండగ


శ్యామలాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవ్

సాలూరు:

పట్టణంలో 15 సంవత్సరాల తరువాత శ్యామలాంబ అమ్మవారి పండగ ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. పండగకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. ఆదివారం ఉయ్యాలకంబాల, సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం జరగనుంది. పండగ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పండగకు వచ్చే భక్తుల కోసం 1240 బస్సులు ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. అమ్మవారి పండగ ఏర్పాట్లను సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇంచార్జ్ పీవో అశుతోష్ శ్రీవాస్తవ్ శనివారం పరిశీలించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పండగ ఏర్పాట్లపై ఆరా తీశారు. అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు.


విద్యుత్ వెలుగులతో విరాజిల్లుతున్న అమ్మవారి ప్రభ

‘బీట్ ది హీట్’తో అవగాహన

- వేసవి నుంచి రక్షణ పొందండిలా..
- డీఎంహెచ్‌వో భాస్కరరావు


పార్వతీపురం రూరల్: వెంకంపేటలో స్వర్ణాంధ్రపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది


స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డా.భాస్కరరావు

పార్వతీపురం రూరల్:

వేసవి వేడి నుంచి ఉపశమనం పొందే మార్గాలను పాటించడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం సందర్భంగా బీట్ ది హీట్ కార్యక్రమం ద్వారా వెంకంపేట గ్రామంలో తామర చెరువు వద్ద ఉపాధి హామీ వేతనదారులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను, నీడ కోసం వేసిన టెంట్‌లను ఆయన పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృత్తి రీత్యా బాహ్య ఉష్ణోగ్రతల్లో పని చేసేవారు వేసవి వేడి నుంచి ఉపశమనం పొందాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు మనకు అందుబాటులో ఉన్న సులభ పద్ధతులను పాటించి తద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. తేలికపాటి వదులు దుస్తులు ధరించాలని, గొడుగు, టోపీ ఉపయోగించాలని, నీడన సేద తీరాలని, అవసరమైన నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రావణాలు ఎక్కువసార్లు తీసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో చలివేంద్రాలు ఉండేలా చూసుకోవాలని, వృద్ధులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ స్వచ్ఛంధ్ర కార్యక్రమ వివరాలు సాసా యాప్‌లో వైద్య సిబ్బంది అప్లోడ్ చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం వారికి అక్కడ తయారు చేసిన ఓఆర్ఎస్ ద్రావణం తాగించి ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ పిఎల్.రఘుకుమార్, వైద్యాధికారి డాక్టర్ ఎంఎన్‌కె. తిరుమలప్రసాద్, సర్పంచ్ తీళ్ల కృష్ణ, సూపర్‌వైజర్లు శ్రీరాములునాయుడు, జయగౌడ్, ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగ సిబ్బంది శంకర్రావు, అచ్యుతరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పాచిపెంట: స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న అధికారులు

పాచిపెంట: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛాంధ్రా - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఈవోపీఆర్‌డీ మల్లేశ్వరరావు, సీడీపీవో అనంతలక్ష్మి, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బలిజిపేటలో...

బలిజిపేట: వేసవి దృష్ట్యా ప్రతీ ఒక్కరు ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందాలని అందుకు తగు జాగ్రత్తలు పాటించాలని డీఆర్‌డీఏ ఏపీడీ, మండల ప్రత్యేకాధికారి వై.సత్యంనాయుడు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బలిజిపేటలో శనివారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజలు ఆరుబయట ఎండలో తిరగకూడదన్నారు. పని ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అవసరమన్నారు. పక్షులకు, పశువులకు నీటితొట్టెలు వంటివి ఏర్పాటు చేసి నీరుపోసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్, ఈవోపీఆర్‌డీ పుష్పారావు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


బలిజిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మక్కువలో..


మక్కువ: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మక్కువ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని మండల ప్రత్యేకాధికారి బి.శ్యామల అన్నారు. మండలంలోని వెంకటభైరిపురం గ్రామంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంపీడీవో డీడీ స్వరూపరాణి, ఉపాధి హామీ ఏపీవో ఈశ్వరమ్మ, వివిధ శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం రూరల్: పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదేశాలతో శనివారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో డీసీఆర్‌బీ, ఎస్‌బీ, కమ్యూనికేషన్, మహిళా సెల్, డీపీవో, ఆర్మ్‌డ్ రిజర్వ్ తదితర పోలీసు శాఖ పరమైన అధికారులు జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాలను తొలగించారు.


పార్వతీపురం రూరల్: ఎస్పీ కార్యాలయ ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న పోలీసు శాఖాధికారులు

ఆహారపు అలవాట్లతో రక్తపోటు నివారణ



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం టౌన్: మనిషిని నిశ్శబ్దంగా దెబ్బ తీసే రోగ కారకాల్లో రక్తపోటు ప్రధాన సమస్యగా మారిందని, సరైన జీవనశైలి, ఆహార నియమాలు పాటించడం ద్వారా నియంత్రించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కార్యాలయ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు పలు సూచనలు చేశారు. సకాలంలో బీపీ గుర్తించకపోవడం, నియంత్రణ లేకపోతే అధికమై శరీరంలో ముఖ్యమైన అవయవాలైన మూత్రపిండాలు, రక్తనాళాలు, గుండెపై ప్రభావం చూపి మరిన్ని తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందన్నారు. ఆహారంలో ఉప్పు తగ్గించుకోవడం, సమతుల ఆహారం తీసుకోవడం, శారీరక శ్రమ తగినంత అవసరమని తెలిపారు. వైద్య సిబ్బంది ఎన్సీడీ సర్వేలో గుర్తించిన బీపీ వ్యాధిగ్రస్తులను పర్యవేక్షణ చేస్తూ వారి ఆరోగ్యం మెరుగునకు కృషి చేయాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్‌వో బీపీ తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఎం.నారాయణరావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డా పిఎల్.రఘుకుమార్, డీపవో లీలారాణి, డీపీహెచ్ఎన్‌వో ఉషారాణి, సూపరింటెండెంట్ కామేశ్వరరావు, డీసీఎం లత, సూపర్‌వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులకు మద్దతివ్వడం సరికాదు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం తహసీల్దార్ ఫిర్యాదు, ఎమ్మెల్యే తీరుపై ఉద్యోగ, రాజకీయ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి అధికారులను వైఎస్సార్‌సీపీ వెనుకేసుకొస్తోందన్నారు. జెడ్పీ చైర్మన్ హోదాలో ఉన్న మజ్జి శ్రీనివాసరావుకు సంబంధిత అధికారులు స్పందించకపోతే ఏవిధంగా స్పందిస్తారో తెలపాలన్నారు. అద్దాల మేడలో ఉండి తనపై రాళ్లు విసిరితే, విసిరిన వారికే ప్రమాదమన్నారు.

సచివాలయ సిబ్బంది రాక కోసం ఎదురు చూపులు


సచివాలయ ఉద్యోగుల కోసం వేచి చూస్తున్న స్థానిక గిరిజనులు

పార్వతీపురం రూరల్: మండలంలోని డీకేపట్నం సచివాలయ పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు రేషన్ కార్డుల సవరణలు, ఇతర సమస్యలపై సచివాలయానికి శనివారం రాగా సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. సచివాలయ సిబ్బంది సకాలంలో సమయానికి రాకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు తాడంకి సాయిబాబా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై సచివాలయంలో అందుబాటులో ఉన్న మహిళ పోలీసు వద్ద ప్రస్తావించగా వీఆర్‌వో అందుబాటులో లేరని, వెల్ఫేర్ అసిస్టెంట్ సెలవులో ఉన్నారని, డిజిటల్ అసిస్టెంట్ బదిలీపై వేరొక ప్రాంతానికి వెళ్లిపోయారని, అగ్రికల్చరల్ వీఏఏ శిక్షణ నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లారని చెప్పారని సాయిబాబా చెప్పారని ఆయన పేర్కొన్నారు. ఇలాగైతే గిరిజనులకు ఎలా సేవలందేదని ఆయన ప్రశ్నించారు. గిరిజనులను పదేపదే తిప్పకుండా సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



సీతానగరం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలకు పచ్చిరొట్ట తీగలు కింద నుంచి పై వరకు అల్లుకున్నాయి. వీటి వల్ల మంటలు వచ్చి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. సీతానగరం పీహెచ్‌సీ వద్ద నున్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఇలా పిచ్చి మొక్కలు అల్లుకోవడంతో మంటలు రేగుతున్నాయి. విద్యుత్ శాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

– సీతానగరం



ఘనంగా ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం



సీతానగరం మండలం కృష్ణారాయపురం గ్రామస్తులు నిర్మించుకున్న శివాలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. కంకణాలు కట్టుకున్న భక్తులు కలశాలతో తిరువీధి చేస్తూ యాగశాలకు చేరుకున్నారు. వేద పండితులు ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. ఆది, సోమవారాలు కూడా ప్రత్యేక పూజలు జరగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. – సీతానగరం

కొనసాగుతున్న దీక్షలు



ఐటీడీఏ ద్వారా ఏజెన్సీలోని ఉపాధ్యాయ పోస్టులను ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసి ఆదివాసీలతోనే నియామకాలను చేపట్టాలని కోరుతూ మన్యం జిల్లా ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి(ఏజేఏసీ) ఆధ్వర్యంలో పార్వతీపురం ఐటీడీఏ ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం మూడో రోజూ కొనసాగాయి. 2025 మెగా డీఎస్సీలో ప్రకటించిన 881 గిరిజన ప్రాంత పోస్టులను మినహాయించి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని నినాదాలు చేశారు. దీక్షల్లో కె.ధర్మారావు, ఆరిక నీలకంఠం, డి.సీతారాం, రామకృష్ణ, చంద్రశేఖర్, మల్లయ్య, గిరిధర్, సాయిబాబు, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు టి.సత్యనారాయణ, వై.సూర్యనారాయణ, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

– పార్వతీపురం

మహిళల జీవనోపాధి మెరుగుకు చర్యలు


కొమరాడ: శిక్షణార్థులతో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ గెద్దమ్మ

గరుగుబిల్లి:

మహిళల జీవనోపాధి మెరుగుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మండల కేంద్రంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఇస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణను ఆమె శనివారం పరిశీలించారు. శిక్షణలో ఏమేమి నేర్పిస్తున్నారన్న విషయాలను శిక్షణార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మహిళ స్వశక్తితో ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపడుతోందని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కొమరాడ: మండల కేంద్రంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఇస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణను బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గెద్దమ్మ శనివారం పరిశీలించారు. మహిళల స్వయం ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం కల్పిస్తున్న ఈ 90 రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట ఎంపీడీవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.